క్లుప్తంగా

నెహ్రూ సేవలు మరువలేనివి



నివాళులర్పిస్తున్న నాయకులు

షాద్‌నగర్: స్వర్గీయ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ దేశానికి చేసిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య యాదవ్ అన్నారు. సోమవారం షాద్‌నగర్ కాంగ్రెస్ నాయకులు నెహ్రూ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని పద్మావతీ కాలనీలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొంకళ్ళ చెన్నయ్య మాట్లాడుతూ.. నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా నెహ్రూ ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపట్టారని, తర్వాత ప్రజల్లో సుస్థిరమైన స్థానం సంపాదించారన్నారు. ప్రధానిగా ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు ఆర్ ఎన్ రాజు, గోపాల్, మురళీకృష్ణ, పెంటయ్య, సురేందర్, సుజీత్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



బాధితులకు నగదు అందిస్తున్న ప్రజాప్రతినిధులు

కేశంపేట: మండల కేంద్రంలోని నాగుర్లగడ్డ తండాకు చెందిన మంజుల సోమవారం మృతి చెందింది. మృతురాలిది నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియల నిమిత్తం స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి, కేశంపేట మాజీ సర్పంచ్ యెన్నం శ్రీధర్‌రెడ్డి, ఇబ్రహీం రూ.5వేల చొప్పున, తలసాని పవన్‌కుమార్ రెడ్డి రూ.3వేల నగదును బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో పాండుయాదవ్, శంకర్‌నాయక్, రాజునాయక్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

వారణాసికి తరలిన బీజేపీ నేతలు



వారణాసికి తరలివెళ్తున్న నేతలు

షాద్‌నగర్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోదీ పోటీ చేస్తున్న వారణాసి నియోజకవర్గానికి సోమవారం షాద్‌నగర్ నుంచి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో నాయకులు పసుల నర్సింహ్మా యాదవ్, గడ్డమీది రాజు, బోయ అశోక్, మహేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రాఘవేందర్ గుప్తా, విక్రమ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న పాండుగౌడ్

మొయినాబాద్‌రూరల్: ఉచిత వైద్య శిబిరాలు పేద ప్రజలకు ఎంతో మేలు చేస్తాయని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రంగారెడ్డి జిల్లా వైస్ చైర్మన్ డాక్టర్ పాండుగౌడ్ అన్నారు. మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో యశోద, ఉస్మానియా, మెడివిజన్ ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోగులను పరిశీలించి వారికి కావాల్సిన మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు కోటిరెడ్డి, నర్సింహ్మారెడ్డి, క్రాంతి, వైద్యులు ధనలక్ష్మి, మండల విశ్వకర్మ గౌరవ అధ్యక్షుడు నర్సింహ్మాచారి, గ్రామస్తులు మైపాల్‌రెడ్డి, పంచాయతీ కారోబార్ గోపాల్‌చారి, తెలుగు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ మార్కెట్‌లో విక్రయానికి రైతుల మొగ్గు

కొందుర్గు: కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లో అధికంగా సన్న వరి రకాలనే సాగు చేస్తారు. ఈ నేపథ్యంలో కొందుర్గు మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. ప్రభుత్వం వరి క్వింటాల్‌కు రూ.2,203లు ధర ఏర్పాటు చేసింది. కాగా బహిరంగ మార్కెట్లో ప్రస్తుతం క్వింటాల్‌కు రూ.2,600 ధర పలకడంతో రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకురావడానికి నిరాసక్తత చూపుతున్నారు.

అప్రమత్తం చేస్తూ.. అవగాహన కల్పిస్తూ

ఇదీ జిల్లా ప్రణాళిక	
పంట	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
వరి	1,38,187
పత్తి	1,76,174
వేరుశనగ	550
జొన్న	3,361
మొక్కజొన్న	66,530
ఇతర పంటలు	49,078

- గ్రామాల్లో కొనసాగుతున్న రైతు సదస్సులు
- విత్తనాల కొనుగోలుపై సలహాలు, సూచనలు
- నకిలీ సీడ్స్‌తో నష్టపోకుండా చర్యలు



షాద్‌నగర్ మార్కెట్ యార్డులో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

షాద్‌నగర్: వానాకాలం పంట సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులు వ్యవసాయానికి సిద్ధం అవుతున్నారు. వర్షాలు కురిస్తే విత్తనాలు కొనుగోలు చేసి పంటలు చేసేందుకు అన్నదాతలు ముందుకు సాగుతున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ విత్తనాల విక్రయంపై దృష్టి సారించింది. ఈ మేరకు విత్తన విక్రయాల్లో అక్రమాలు జరగకుండా, నకిలీ విత్తనాలతో రైతులు మోసపోకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రైతులను అప్రమత్తం చేస్తూ.. వారికి అవగాహన కల్పించే విధంగా గ్రామాల్లో వ్యవసాయ అధికారులు రైతు సదస్సులు ప్రారంభించారు.

రైతులు నష్టపోకుండా..

ఈసారి వానాకాలం రైతు పత్తి, వరి పంటల సాగుపైనే ప్రధానంగా దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోకుండా వెంటనే అవగాహన సదస్సులు నిర్వహించాలని వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్‌రావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ అధికారులకు సూచించారు. ఈ మేరకు గ్రామాల్లో ఏఓలు, ఏఈఓలు సదస్సులను నిర్వహించి అవగాహన కల్పిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జూన్ 4 వరకు ఎన్నికల కోడ్ ఉన్నందున ప్రజాప్రతినిధులను ఆహ్వానించకుండానే సదస్సులు నిర్వహిస్తున్నారు. కోడ్ ముగిసిన తర్వాత సదస్సుల్లో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయనున్నారు.

అప్రమత్తం చేయడమే లక్ష్యంగా..

విత్తనాల కొనుగోలు విషయంలో రైతులను అప్రమత్తం చేయడమే ముఖ్య లక్ష్యంగా అధికారులు సదస్సులు నిర్వహిస్తున్నారు. రైతులను పట్టి పీడిస్తున్న నకిలీ విత్తనాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే అధికారులు గుర్తింపు పొందిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, గ్రామాలకు వచ్చి లూజ్‌గా విక్రయించే వారిని నమ్మొద్దని, ప్రతీ కొనుగోలు ప్యాకెట్‌పై అన్ని వివరాలు పరిశీలించడమే కాకుండా విధిగా రసీదులు పొందాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ రసీదులను పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపర్చుకోవాలని రైతులకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.



షాద్‌నగర్‌లో దుక్కి దున్నుతున్న రైతు

సన్నాల సాగుకు చర్యలు

ప్రభుత్వం సన్న ధాన్యానికి ప్రాధాన్యతనిస్తున్న నేపథ్యంలో సన్నాల సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా వ్యవసాయ అధికారులు చర్యలు చేపట్టారు. సన్న ధాన్యం సాగుతో కలిగే లాభాల గురించి అధికారులు రైతులకు వివరిస్తున్నారు. అదేవిధంగా విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతుల వివరాలు నమోదు చేయాలని దుకాణదారులకు సూచిస్తున్నారు. అదేవిధంగా ఎప్పటికప్పుడూ సీడ్, మందుల విక్రయ దుకాణాలను ఏఈఓలు, ఏఓలు పర్యవేక్షిస్తున్నారు. అదేవిధంగా ప్రభుత్వం సబ్సిడీపై అందజేసే విత్తనాలు పక్కదారి పట్టకుండా పటిష్ట చర్యలు చేపట్టారు.

వానాకాలం సాగుకు అవసరమయ్యే విత్తనాల నిల్వల లక్ష్యం ఇలా ఉంది. వరి విత్తనాలు 34,547 క్వింటాళ్లు, మొక్కజొన్న 5,322 క్వింటాళ్లు, కందులు 346 క్వింటాళ్లు, జనుము 1,498 క్వింటాళ్లు, జీలుగ 280 క్వింటాళ్లు, జొన్న 134 క్వింటాళ్లు, మినుము 43 క్వింటాళ్లు, పత్తి విత్తనాల ప్యాకెట్లు 4,91,036 అవసరమవుతాయని నిర్దేశించారు. అదేవిధంగా యూరియా 41,115 టన్నులు, డీఏపీ 14,897 టన్నులు, ఎస్ఎస్‌పీ 4,283 టన్నులు, ఎంఓపీ 5,139 టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 36,548 టన్నులు అవసరం ఉన్నట్లు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

విధిగా రసీదు పొందాలి



రైతుల గుర్తింపు పొందిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి విధిగా రసీదు పొందాలి. బిల్లులను పంట కాలం పూర్తయ్యేవరకు భద్రంగా దాచుకోవాలి. గ్రామాల్లో లూజుగా విక్రయించే విత్తనాలను కొనుగోలు చేయొద్దు.

- నిషాంత్‌కుమార్, ఏఓ, ఫరూఖ్‌నగర్

నకిలీ విత్తనాల కట్టడికి చర్యలు



నకిలీ విత్తనాలతో రైతులు మోసపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి రైతులకు విత్తనాలు, ఎరువుల కొనుగోలుపై అవగాహన కల్పిస్తున్నాం. విత్తనాల దుకాణాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం.

- రాజారత్నం, వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు, షాద్‌నగర్

జీవాలకు టీకాలు తప్పనిసరి



గొల్లూరుగూడలో గొర్రెలకు టీకాలు వేస్తున్న సిబ్బంది

షాబాద్: గొర్రెలు, మేకలకు చిటుక వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు డాక్టర్లు ప్రవంతి, చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని పోతుగల్, గొల్లూరుగూడ, దామర్లపల్లి, కక్కులూర్ గ్రామాల్లో పశువులకు గొంతువాపు, తొడవాపు వ్యాధుల నివారణకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీవాల ఆరోగ్యంపట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గొర్రెలు, మేకలు అనారోగ్యానికి గురికాకుండా ప్రభుత్వం ఏడాదిలో రెండు విడతలు చిటుక వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. గ్రామాల్లో రైతులు తమ జీవాలకు టీకాలు వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి కృషి



దేవరంపల్లిలో పాఠశాలను పరిశీలిస్తున్న మండల విద్యాధికారి సయ్యద్ అక్బర్ తదితరులు

చేవెళ్ల: పాఠశాలలు పునఃప్రారంభంనాటికి అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ఎంపికైన పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు మండల విద్యాధికారి సయ్యద్ అక్బర్ అన్నారు. మండలంలో అమ్మ ఆదర్శ పాఠశాల కింద ఎంపికైన పలు పాఠశాలలను సోమవారం ఆయన మండల ఏఈ ప్రశాంత్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలను పరిశీలించి అక్కడ ఉన్న ఉపాధ్యాయులకు పంచాయతీ కార్యదర్శులకు పాఠశాలల్లో పనులు ప్రారంభించి త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలంలోని దేవరంపల్లి, రేగడిఘనాపూర్, ఆలూరు, ఎన్కేపల్లి, రామన్నగూడ, న్యాలట, బస్తేపూర్ పాఠశాలలు తిరిగి అక్కడ పనులను పరిశీలించినట్లు తెలిపారు. మండలంలో మొత్తం 20 పాఠశాలలు ఎంపికయ్యాయని వాటిలో ఉన్న సమస్యలను గుర్తించి పూర్తి చేయిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలు ప్రారంభించేనాటికి విద్యార్థులకు ఆయా పాఠశాలల్లో సమస్యలు లేకుండా చేస్తామన్నారు. పనులు త్వరగా పూర్తి చేయించుకోవాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఆయన వెంట ఆయా గ్రామాల కార్యదర్శులు, ప్రధానోపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

రమాబాయి అంబేడ్కర్‌కు నివాళి



రమాబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

చేవెళ్ల: బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం తమ కుటుంబాన్ని త్యాగం చేసిన గొప్ప త్యాగమూర్తి రమాబాయి అంబేడ్కర్ అని డీసీసీ మాజీ అధ్యక్షుడు పడాల వెంకటస్వామి, ఆలిండియా అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు బ్యాగరి ప్రభాకర్, కార్యదర్శి మహేశ్, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు ఎస్.ప్రవీణ్‌లు అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్, పూలే విగ్రహాల వద్ద సోమవారం ఆలిండియా అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో రమాబాయి అంబేడ్కర్ 89వ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆలిండియా అంబేడ్కర్ సంఘం చేవెళ్ల మండల అధ్యక్షుడు మల్లెపల్లి శ్రీనివాస్, సీపీఐ నాయకుడు సుధాకర్, సభ్యులు మల్లేశ్, తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

మొయినాబాద్‌రూరల్: మండలంలోని జెడ్పీహెచ్ఎస్ చందానగర్ పాఠశాలలో 1998–99 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు 25 సంవత్సరాల తరువాత అజీజ్‌నగర్‌లోని ఓ వ్యవసాయ క్షేత్రంలో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారందరూ ఒకరినొకరూ పలకరించుకొని పాతజ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులు జయప్రకాశ్, కిషన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, గౌరీశంకర్, రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, మల్లారెడ్డి, కాంచనలను పూర్వ విద్యార్థులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మొయినాబాద్: మండల పరిధిలోని నాగిరెడ్డిగూడ, అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, అప్పారెడ్డిగూడ, చిన్నషాపూర్ గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ అధికారులు హమునాయక్, రాజేశ్‌బాబు తెలిపారు. విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్లకొమ్మల తొలగింపు కారణంగా శ్రీనిధి–1, అప్పారెడ్డిగూడ ఫీడర్ల పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు, శ్రీనిధి–2, చిన్నషాపూర్ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ఈ సమాచారాన్ని ఆయా గ్రామాల రైతులు, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పంచాయతీ ఆస్తులను సంరక్షించాలి

డీపీఓ సురేంద్రమోహన్



పల్లె ప్రకృతివనాన్ని పరిశీలిస్తున్న డీపీఓ సురేంద్రమోహన్, ఎంపీడీఓ శైలజ

మహేశ్వరం: గ్రామాల్లో ఉన్న పంచాయతీ ఆస్తులను సంరక్షించాలని డీపీఓ సురేంద్రమోహన్ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని మహేశ్వరం, పెండ్యాల గ్రామంలో గ్రామ పంచాయతీ ఆస్తులు, పల్లె ప్రకృతివనం, వైకుంఠధామం, డంప్ యార్డులు, నర్సరీలు, క్రీడా ప్రాంగణాలను ఆయన స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. నర్సరీలు, పల్లె ప్రకృతివనాల్లో మొక్కలకు నీరు పోసి సంరక్షించాలన్నారు. డంప్ యార్డులలో తడి, పొడి చెత్తలను వేరువేరుగా పోసి వర్మీకంపోస్టు ఎరువును తయారుచేసి చెట్లకు వేయాలని తెలిపారు. వైకుంఠధామాల్లో దహనాలు చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తగు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శైలజ, ఎంపీఓ రవీందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వజ్రలింగం, బిల్‌కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

ఏఓ వెంకటేశం



నాగర్‌గూడలో విత్తనాల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ వెంకటేశం

షాబాద్: రైతులు లైసెన్స్ కలిగిన దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, అనుమతి లేని విత్తనాలను విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని షాబాద్ ఏఓ వెంకటేశం అన్నారు. సోమవారం షాబాద్ మండల పరిధిలోని తాళ్లపల్లి, మల్లారెడ్డిగూడ, బోడంపహాడ్ అంతారం, సంకెపల్లిగూడ గ్రామాల్లో రైతులకు విత్తనాల నాణ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. లూజుగా ఉన్న సంచుల్లోని విత్తనాలను కొనుగోలు చేయొద్దన్నారు. రైతులు తప్పనిసరిగా గుర్తింపు పొందిన దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని, దానికి సంబంధించిన రసీదును భద్రపరుచుకోవాలని సూచించారు. రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులు ఉపయోగించాలని పలు సలహాలు, సూచనలు చేశారు. మండల పరిధిలోని నాగర్‌గూడలో విత్తనాల విక్రయ దుకాణాలను ఆయన పరిశీలించారు. డీలర్లకు సంబంధించిన రిజిస్టర్లు, ఇన్వాయిసులు, విత్తన ప్యాకెట్లపై ఉన్న లాట్ నంబర్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓలు రాజేశ్వరి, లిఖీత, సోనిశ్రీ, గీత, రైతులు తదితరులు ఉన్నారు.

రసీదులు తప్పనిసరి

కొందుర్గు: ప్రభుత్వ గుర్తింపు పొందిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని ఏఓ శిరీష సూచించారు. సోమవారం కొందుర్గు, మహదేవ్‌పూర్ రైతు వేదికల్లో రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో విధిగా రసీదులు పొందాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు వాసవి, అనూష, మౌనిక, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

యాచారం: ప్రభుత్వ పాఠశాలలు నాణ్యమైన విద్యాబోధనతో ఆదర్శంగా ఉండాలని ఎంపీపీ కొప్పు సుకన్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని అధికారులకు సూచించారు. పాఠశాలల అభివృద్ధి, సౌకర్యాల కల్పన కోసం ప్రభుత్వం నుంచి మంజూరయ్యే నిధులను సక్రమంగా ఖర్చు చేయాలన్నారు. కమిటీలు పాఠశాల అభివృద్ధికి గ్రామాల్లోని దాతల సహకారం తీసుకోవాలని సూచించారు. నిధుల కొరత ఉన్న పాఠశాలలకు మండల పరిషత్ నుంచి మంజూరు చేస్తానన్నారు. సమావేశంలో ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, మండల పంచాయతీ అధికారి ఉమారాణి, రోడ్లు భవనాల శాఖ ఏఈ వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యం.. దైన్యం

- సిబ్బంది లేక మూతపడిన ఉపకేంద్రాలు
- మూడు, నాలుగు ఆస్పత్రులకు ఒకే డాక్టర్
- ప్రైవేట్ వైద్యులను ఆశ్రయిస్తున్న పశుపోషకులు



వెంకటాపూర్‌లో మూతపడిన పశువైద్య ఉపకేంద్రం

మొయినాబాద్: గ్రామాల్లో పశువైద్యం అందని ద్రాక్షలా మారింది. ముఖ్యంగా సిబ్బంది కొరత వేధిస్తోంది. ఒక్క వైద్యాధికారే చుట్టుపక్కల గ్రామాల వైద్యశాలలను చూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. సిబ్బంది ఉన్నచోట.. సమయపాలన పాటించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. వైద్యులు, సిబ్బంది ఎప్పుడు వస్తారో.. తెలియదు. దీంతో వైద్యం కోసం ఎదురుచూపులే మిగులుతున్నాయి. ఇంకోవైపు చాలా గ్రామాల్లో సిబ్బంది లేకపోవడంతో పశువైద్య ఉపకేంద్రాలు మూతపడ్డాయి. దీంతో పశువులకు సరైన వైద్యం అందకపోవడంతో పశుపోషకులు ఇబ్బంది పడుతున్నారు.

మండలంలో పశువైద్య కేంద్రాల వివరాలు..

మొయినాబాద్ మండలంలో మూడు పశువైద్య కేంద్రాలు, ఐదు పశువైద్య ఉపకేంద్రాలు ఉన్నాయి. మొయినాబాద్, అమ్డాపూర్, కనకమామిడి గ్రామాల్లో పశువైద్య కేంద్రాలు ఉండగా వీటిలో డాక్టర్లు ఉన్నారు. కనకమామిడి పశువైద్య కేంద్రంలో అటెండర్ పోస్టు ఖాళీగా ఉంది. ఉన్న డాక్టర్ కూడా సమయానికి అందుబాటులో ఉండడం లేదు. మరోవైపు మండలంలోని అజీజ్‌నగర్, చిలుకూరు, పెద్దమంగళారం, కేతిరెడ్డిపల్లి, వెంకటాపూర్ గ్రామాల్లో పశువైద్య ఉపకేంద్రాలు ఉన్నాయి. వీటిలో చిలుకూరు, కేతిరెడ్డిపల్లి, వెంకటాపూర్ పశువైద్య ఉపకేంద్రాల్లో పశువైద్య సిబ్బంది లేరు.

ఐదేళ్లుగా మూతపడిన ఉపకేంద్రాలు

మండలంలోని వెంకటాపూర్, కేతిరెడ్డిపల్లి గ్రామాల్లోని పశువైద్య ఉపకేంద్రాలు ఐదేళ్లుగా మూతపడ్డాయి. ఐదేళ్ల నుంచి ఇక్కడ పశువైద్య సిబ్బంది ఎవరూ అందుబాటులో లేరు. అదే విధంగా చిలుకూరు పశువైద్య ఉపకేంద్రం రెండేళ్లుగా మూతపడింది. పశువైద్య సిబ్బంది లేకపోవడంతో మూడు గ్రామాల్లో పశువైద్య ఉపకేంద్రాలు తెరుచుకోవడం లేదు. దీంతో ఆయా ఉపకేంద్రాల పరిధిలోని రైతులు, గొర్రెలు, మేకల పెంపకందారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పశువులు, జీవాలు అనారోగ్యానికి గురైతే మొయినాబాద్ మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రానికే వెళ్లాల్సి వస్తోంది.

ప్రైవేటుపై ఆధారపడుతున్న రైతులు

మండలంలో ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు అధికంగా ఉన్నాయి. వాటితో పాటు మండలంలోని చాలా ఫాంహౌస్‌లలో కుక్కలు, కోళ్లు, మేకలు, గుర్రాలు పెంచుతున్నారు. గ్రామాల్లోని పశువులతోపాటు ఫాంహౌస్‌లలోని పశువులకు పశువైద్యం అందించడానికి సరైన సిబ్బంది లేకపోవడంతో చాలామంది ప్రైవేటు పశువైద్యులపై ఆధారపడుతున్నారు. ప్రైవేటు పశువైద్యులు, సిబ్బందిని తమ పశువుల వద్దకే రప్పించుకొని వైద్యం చేయిస్తున్నారు.

పశువైద్యులు అందుబాటులో లేరు



ఏడేళ్ల క్రితం పది గేదెలతో డెయిరీ ఏర్పాటు చేశాను. గేదెలకు ఎలాంటి వైద్యం అందించాలన్నా ప్రైవేటు పశువైద్యులనే సంప్రదించాల్సి వస్తోంది. వెంకటాపూర్‌లో పశువైద్య ఉపకేంద్రం ఉన్నా సిబ్బంది ఎవరూ లేక మూతపడింది. ప్రైవేటు పశువైద్యులతో వైద్యం చేయిస్తే ఒక్కోసారి రూ.5వేల నుంచి 6 వేల వరకు ఖర్చు వస్తోంది. ప్రభుత్వం స్పందించి పశువైద్యులను నియమించి, మూతపడ్డ పశువైద్య కేంద్రాలను తెరిపించాలి.

-భిక్షపతి, పాడిరైతు, శ్రీరాంనగర్

మూడు సబ్‌సెంటర్లు ఖాళీగా ఉన్నాయి



మండలంలో మూడు పశువైద్య కేంద్రాలు, ఐదు పశువైద్య ఉపకేంద్రాలు ఉన్నాయి. వెంకటాపూర్, కేతిరెడ్డిపల్లి, చిలుకూరు ఉపకేంద్రాల్లో సిబ్బంది లేకపోవడంతో మూతపడ్డాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సిబ్బంది వస్తే ఉపకేంద్రాలు తెరిచే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఉన్న సిబ్బందితోనే అన్ని గ్రామాల్లో పశువులకు వైద్య సేవలు అందిస్తున్నాం.

-శ్రీలత, మండల పశువైద్యాధికారి, మొయినాబాద్